క్లుప్తంగా...

నేడు మాస శివరాత్రి పూజలు

సనత్‌నగర్: చైత్ర మాసం బహుళ త్రయోదశి తదుపరి చతుర్దశి (మాస శివరాత్రి) సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి రుద్రహోమం, సాయంత్రం 6.30 గంటల (ప్రదోష కాలం) సమయంలో అభిషేకం, ప్రత్యేక అలంకరణ దర్శనం ఉంటుందని భక్తులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ప్రత్యేక పూజల్లో పాల్గొనాలన్నారు.

ఆర్య సమాజ మందిరంలో శిక్షణ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ: వారాసిగూడ మేడిబావి వ్యాస్‌నగర్ ఆర్య సమాజ మందిరంలో ఈ నెల 22 నుంచి 30 వరకు వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆర్యవీర్‌దళ్ డైరెక్టర్, ఓయూ అధ్యాపకులు డాక్టర్ ధర్మతేజ సోమవారం తెలిపారు. దేశభక్తి, పితృభక్తి, దైవభక్తితో పాటు కరాటే, కర్రసాము, యోగా తదితర అంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల 12–25 ఏళ్ల అభ్యర్థులు ఈ నెల 21 నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



జీఎం రమణారెడ్డితో మాట్లాడుతున్న శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: మెండా మార్కెట్ డివిజన్‌లోని లక్ష్మయ్యదొడ్డి వివేకానందనగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని సీనియర్ నాయకులు శ్రీగణేష్ కోరారు. సోమవారం ఆయన మారేడుపల్లిలోని జలమండలి కార్యాలయంలో జీఎం రమణారెడ్డిని కలిసి డ్రైనేజీ సమస్య గురించి వివరించారు. గత కొన్నేళ్ల నుంచి స్థానికులు మురుగు నీటి సమస్యతో సతమతమవుతూ రోగాల బారిన పడుతున్నారని జీఎం దృష్టికి తెచ్చారు. స్పందించిన జీఎం కొత్త డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాత్కాలికంగా వెంటనే డ్రైనేజీ లైన్ శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, రాజయ్య, విక్కీ, మల్లేష్, గౌతం, పవన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మంచినీటి సరఫరాను ప్రారంభిస్తున్న హేమలత

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారం, బన్సీలాల్‌పేట్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ హేమలత అన్నారు. డివిజన్‌లోని చాచా నెహ్రూనగర్‌లో రూ. 10 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన మంచినీటి సరఫరాను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. డివిజన్‌లో లక్షలాది రూపాయల వ్యయంతో అనేక ప్రజాభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో సీసీ నగర్ బస్తీలో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. పవన్‌కుమార్ గౌడ్, లక్ష్మీపతి, రాజు, రాజేందర్, ప్రేమ్, వినయ్ పాల్గొన్నారు.

గోవర్ధన్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ లైబ్రరీ సైన్స్ విభాగంలో అజ్మీరా గోవర్ధన్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. విశ్రాంత అధ్యాపకురాలు ప్రొ.భారతి పర్యవేక్షణలో రిలవెన్స్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ కరిక్యూలమ్ ఇన్ ఫేసింగ్ ప్రజెంట్ డే రోల్స్ అండ్ ఛాలెంజస్ బై లైబ్రరీ సైన్స్ ప్రొఫెషనల్స్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొల్లా బుద్ధారం న్యూ లంబాడీ తండాకు చెందిన ఆయన పలువురు అభినందించారు.

రైల్ నిలయంలో అంబేడ్కర్ జయంతి



సాక్షి, సిటీబ్యూరో: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం సికింద్రాబాద్ రైల్‌నిలయంలో ఘనంగా నిర్వహించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదనపు జనరల్ మేనేజర్ ఆర్. ధనుంజయులు, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ రాజీవ్ కిషోర్, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని నివాళి అర్పించారు.

అన్నపూర్ణ ఆకలి తీర్చేనా!

- అడ్డగుట్టలో అటకెక్కిన రూ.5ల భోజనం
- పునః ప్రారంభించాలంటున్న అడ్డా కూలీలు
- చోద్యం చూస్తున్న అధికారులు



అడ్డగుట్టలో మూతబడిన భోజన కేంద్రం

అడ్డగుట్ట: పేద, మధ్య తరగతి ప్రజల ఆకలి తీర్చడమే ప్రధాన లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ, హరే కృష్ణ ఆర్గనైజేషన్ల సంయుక్తాధ్వర్యంలో అందుబాటులోకి తీసుకొచ్చిన రూ. 5ల భోజన పథకం అడ్డగుట్టలో మూతబడింది. సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోని కారణంగా ఐదు రూపాయల భోజనం అడ్డగుట్టలో అటకెక్కింది. లాక్‌డౌన్ కన్నా ముందు మూన్నాళ్ల ముచ్చటగా నెలకోసారి భోజన కేంద్ర ప్రాంతాన్ని మారుస్తూ సంబంధిత సిబ్బంది కాలయాపన చేసేవారు. దీంతో నిత్యం భోజనానికి వచ్చే పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులకు గురవుతుండేవారు. అనంతరం కొంతకాలం తర్వాత రూ. 5 భోజన కేంద్రం అడ్డగుట్ట నుంచి తొలగించారు. అతి తక్కువ ధరలో మంచి భోజనం లభిస్తుండడంతో ఎంతో మంది ప్రజలు ఐదు రూపాయల భోజనం పట్ల ఆసక్తి కనబరుస్తూ ఇష్టంగా తినేవారు. అడ్డగుట్టలో భోజన కేంద్రాన్ని తొలగించడంతో ప్రజలకు రూ.5 భోజనం అందని ద్రాక్షలా మారింది.

పేదలు అధికంగా ఉండే ప్రాంతం..

ఆసియా ఖండంలోనే అతిపెద్ద మురికివాడగా పేరున్న అడ్డగుట్టలో అనేక మంది పేద ప్రజలు నివసిస్తారు. అయితే వీరిలో అడ్డా కూలీలు కూడా చాలా మంది ఉంటారు. నిత్యం పొట్ట తిప్పలు కోసం వివిధ పనులు చేసుకునే వాళ్లు మధ్యాహ్నం సమయంలో రూ. 5ల భోజనంతో కడుపు నింపుకుందామని కొండంత ఆశతో ఉంటారు. కాని దాదాపు రెండున్నర సంవత్సరాలుగా దూరం కావడంతో అవస్థలు పడుతున్నారు. బయట తినాలంటే సుమారు రూ. 50 ఖర్చు అవుతాయి. అవే డబ్బులుంటే పది రోజులు తినవచ్చు అనుకునే నిరుపేద ప్రజలు ఉండే అడ్డగుట్టలో రూ. 5 భోజన కేంద్రాన్ని వెంటనే పునఃప్రారంభించాలని కోరుతున్నారు.

నాలుగేళ్ల క్రితం ప్రారంభం..

పేద ప్రజలు, అడ్డా కూలీలు నివసించే ప్రాంతమైన అడ్డగుట్టలో రూ. 5 భోజన పథకాన్ని ప్రారంభిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సుమారు నాలుగేళ్ల క్రితం ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆదేశాలతో జీహెచ్‌ఎంసీ అధికారులు అడ్డగుట్టలో ప్రారంభించారు. అడ్డగుట్ట జీఎం అంజయ్య విగ్రహం ఎదురుగా భోజన కేంద్రం ఏర్పాటు చేశారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ పద్మారావు తానే స్వయంగా వచ్చి రూ. 5 భోజన కేంద్రాన్ని ప్రారంభించి జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన కూడా అక్కడే భోజనం చేశారు.

"పునః ప్రారంభించాలి..



అధిక శాతం పేద ప్రజలు, కార్మికులు నివసించే అడ్డగుట్టలో రూ. 5 భోజన కేంద్రాన్ని పునః ప్రారంభించాల్సిన అవసరం ఉంది. కోవిడ్‌కు ముందు ఎంతో మంది ఆకలి తీర్చిన ఐదు రూపాయల భోజన కేంద్రం ప్రస్తుతం అడ్డగుట్టలో అందుబాటులో లేకపోవడం బాధాకరం. ఈ ప్రాంతంలో సదరు కేంద్రాన్ని పునఃప్రారంభిస్తే ఎంతో బాగుంటుంది. ఒక్కపూట భోజనం కోసం ఎన్నో తిప్పలు పడే వారు ఎంతో మంది ఉన్నారని, అలాంటి వారికి ఈ భోజన కేంద్రం ద్వారా పట్టెడన్నం దొరుకుతుంది.

–మంద సురేష్, బీజేపీ నాయకుడు


"ఆసరా కోల్పోయాం..



రోజువారి కూలీలకు ఎంతో ఆసరాగా ఉండే ఐదు రూపాయల భోజన స్టాల్‌ను అడ్డగుట్టలో నుంచి తొలగించడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. నిత్యం మధ్యాహ్నం కేవలం రూ. 5 లకే అన్నం, పప్పు, చారు, మజ్జిగ, పచ్చడితో మంచి భోజనం దొరికేది. అతి తక్కువ ఖర్చుతో కడుపునిండా తినేవాళ్లం. కానీ.. భోజన కేంద్రం తొలగించడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

–రమణమ్మ, అడ్డాకూలి

'గాంధీ డైట్' టెండర్ల ప్రక్రియకు బ్రేక్!



గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి డైట్ టెండర్ల ప్రక్రియకు న్యాయస్థానం బ్రేక్ వేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆస్పత్రిలో ఇన్ పేషెంట్లుగా చికిత్స పొందుతున్న రోగులకు ఆహార పదార్థాలు సరఫరా చేసే డైట్ నిర్వహణ కోసం టెండర్లను ఆహ్వానించారు. మొత్తం పదకొండు దరఖాస్తులు అమ్ముడుపోగా చివరి రోజైన సోమవారం ఐదుమంది దరఖాస్తుదారులు సీల్డ్ కవర్‌లలో తమ టెండర్లను దాఖలు చేశారు. ఇదిలా ఉండగా రోగులకు బలవర్ధకమైన ఆహారం సరఫరా చేయాలని భావించిన ప్రభుత్వం డైట్ ఛార్జీలను రూ.40 నుంచి రూ.80 లకు పెంచి, నూతన టెండర్లను ఆహ్వానించాలని జీవో జారీ చేసింది. గతేడాది ఏప్రిల్ నెలలో నూతన టెండర్లకు ఆహ్వానించారు. అప్పటికే గాంధీ డైట్ కాంట్రాక్టు దక్కించుకున్న సహస్ర సంస్థ తమ కాల పరిమితి పూర్తి కాలేదని, టెండర్ల ప్రక్రియను నిలుపుదల చేయాలని కోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం సహస్ర సంస్థ పిటీషన్‌ను కొట్టివేసి టెండర్ల ప్రక్రియ కొనసాగించాలని తెలిపింది. అడ్వొకేట్ జనరల్ సలహా మేరకు టెండర్లను తెరిచి అర్హత సాధించిన శివనారీ సంస్థకు కాంట్రాక్టును కేటాయించారు. ఈ క్రమంలో సహస్ర సంస్థ తమకు అన్యాయం జరిగిందని మరోమారు కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వాదోపవాదాలు విన్న న్యాయస్థానం జిల్లా లేదా రాష్ట్ర డైట్ కమిటీలో తేల్చుకోవాలని సూచించింది. రాష్ట్ర డైట్ కమిటీ ఆదేశాల మేరకు ఈనెల 3వ తేదీ నుంచి నూతనంగా డైట్ టెండర్లను ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో శివనారీ సంస్థ కోర్టును ఆశ్రయించింది. గతంలో అర్హత సాధించినప్పటికీ డైట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించలేదని, ఇప్పుడు కొత్తగా డైట్ టెండర్లకు ఆహ్వానించడం తగదని, తమకు అన్యాయం జరిగిందని కోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం టెండర్ల ప్రక్రియపై స్టే విధించడంతో మంగళవారం జరగాల్సిన డైట్ టెండర్ల ఫైనలైజ్ ప్రక్రియ అర్ధంతరంగా నిలిచిపోనుంది. కోర్టు స్టే విధించినట్లు తమకు మౌలికంగా సమాచారం అందిందని, లిఖితపూర్వకంగా అందిన తర్వాత న్యాయ నిపుణుల సలహా, సూచలన మేరకు తదుపరి చర్యలు చేపడతామని ఆస్పత్రి పాలనా యంత్రాంగం తెలిపింది.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట



రంజాన్ తోఫాలు పంపిణీ చేస్తున్న శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం ముస్లింలకు రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రంజాన్ పండుగను ఆనందోత్సవాలతో జరుపుకోవాలనే ఉద్దేశంతో నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫాల పంపిణీ, ఇఫ్తార్ విందుల వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు.

ఘనంగా జయంతి మహోత్సవాలు

రాంగోపాల్‌పేట్: శివాజీనగర్‌లోని సుదర్శన భూవరాహ స్వామి జయంతి మహోత్సవాలు కనుల పండువగా ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి బుధవారం వరకు ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వామివారికి 108 కళశాలతో అభి షేకం నిర్వహించారు. దేవాలయంలో సాయంత్రం నాధస్వరం, అన్నమాచార్య కీర్తనలు నిర్వహించారు. కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భవనంపై నుంచి పడి మహిళ మృతి

రసూల్‌పురా: కూలర్‌లో నీళ్లు నింపుతుండగా రెండవ అంతస్తు నుంచి జారిపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బొల్లారం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రిసాలబజార్‌కు చెందిన చంద్రకళ సోమవారం రాత్రి కూలర్‌లో నీళ్లు పోస్తుండగా కాలుజారి రెండవ అంతస్తు నుంచి కిందపడి గాయాలకు గురైంది. హుటాహుటిన అల్వాల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

ఇన్ఫెక్షన్ల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ



సమావేశంలో చర్చిస్తున్న సూపరింటెండెంట్

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో ఇన్ఫెక్షన్లను నియంత్రించి నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని సూపరింటెండెంట్ రాజారావు అన్నారు. ఆస్పత్రి సెమినార్ హాల్లో సోమవారం జరిగిన ఇన్ఫెక్షన్ల నియంత్రణ కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఇన్ఫెక్షన్‌లను నియంత్రించేందుకు 16 అంశాలతో చెక్‌లిస్ట్ తయారు చేశామని, ఆపరేషన్, పోస్ట్ ఆపరేషన్, ఐసీయూ, హైడిపెండెన్సీ నాలుగు యూనిట్‌లుగా విభజించి, రెండు ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సు (ఐసీఎన్), ఒక కంట్రోల్ ఆఫీసర్ (ఐసీఓ) పోస్టులను క్రియేట్ చేసి నియామకం చేపట్టామన్నారు. సర్జికల్ సైట్ ఇన్ఫెక్షన్ (ఎస్‌ఎస్‌ఐ), నీడిల్ స్టిక్ ఇంజ్యూరీస్ (ఎన్‌ఎస్‌ఐ), పోస్ట్ ఎక్స్‌పోజర్ ప్రొఫలాక్సీ, క్యాథిటర్ అసోషియేటెడ్ యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ (సీఏయుటీఐ) తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు తదితర ప్రాంతాల్లో వైరస్, ఫంగస్, బాక్టీరియాల జాడను తెలుసుకునేందుకు ఎయిర్ శాంప్లియర్ మెషిన్‌లు ఏర్పాటు చేశామని, ఫ్లోర్ ఆర్‌ఎంఓలను ఏర్పాటు చేసి ప్రతిరోజు నివేదికలను పరిశీలిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో ఆర్‌ఎంఓలు జయకృష్ణ, ప్రభుకిరణ్, నరేందర్, హైమవతి, వెంకటరమణ, రాములతో పాటు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులకు సర్వం సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపులకు రంగం సిద్ధం చేస్తున్నట్లు బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ తెలిపారు. సోమవారం బోర్డు కార్యాలయంలో అధికారులు, పలువురు క్రీడాకారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 30వ తేదీ నుంచి నెల రోజుల పాటు సమ్మర్ క్యాంపుల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా బోర్డు సిబ్బందికి సూచించారు. మడ్‌ఫోర్ట్ హాకీ మైదానం, బొల్లారం, తిరుమలగిరి, ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌లో నిర్వహించే క్యాంపులలో క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, వాలీబాల్, ఫిట్‌నెస్ విభాగాల్లో క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఆయా క్రీడల్లో నిష్ణాతులైన కోచ్‌లను ఈ క్యాంపులలో భాగస్వాములను చేస్తామన్నారు. ఈ సమావేశంలో క్రీడాకారులు యామా, భరత్, రంజిత్, రాజన్, వినోద్, బోర్డు అధికారులు మహేందర్, చైతన, నవీన్ పాల్గొన్నారు.

కోవిడ్‌తో ఎక్మోపై 40 రోజుల చికిత్స

వ్యక్తి ప్రాణాలు కాపాడిన యశోద వైద్యబృందం



రోగితో వైద్యులు

రాంగోపాల్‌పేట్: ప్రాణాంతకమైన కోవిడ్ బారిన పడి తీవ్రమైన బ్యాక్టీరియల్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ ఎక్మో (కృత్రిమ ఊపిరితిత్తుల)పై చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి పునర్జన్మనిచ్చారు సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు. డాక్టర్ హరి కిషన్ గోపుగంట్ల వివరాల ప్రకారం..జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోచంపల్లి గ్రామానికి చెందిన కట్టా నరసింహారెడ్డి (48) కరోనా బారిన పడటంతో స్థానిక ఆస్పత్రిలో చేరాడు. అక్కడ ఆయన కోలుకోకపోగా ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమించడంతో మార్చి 7న యశోద ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు వెంటిలేటర్ సపోర్టుతో అదనపు కార్పోరియల్ ఊపిరితిత్తుల మద్దతు, కృత్రిమ ఊపిరితిత్తుల (ఎక్మో) సపోర్టు అవసరమని గుర్తించి చికిత్స ప్రారంభించారు. కరోనా చికిత్స సమయంలో 4–6 వారాలు తర్వాత కొంత మందిలో ఊపిరితిత్తుల మార్పిడి కూడా చేయాల్సి ఉంటుంది. వీటన్నిటిని పరిగణలోకి తీసుకున్న వైద్య బృందం ఆయనకు అవసరాలకు అనుగుణంగా చికిత్స ప్రారంభించారు. ఇక్కడికి వచ్చే ముందే ఊపిరితిత్తులకు పూర్తిగా నష్టం జరుగడంతో అధిక ఆక్సిజన్ అవసరంపడి ఆరోగ్యం కిష్టమైన దశకు చేరుకుంది. ఈ సమయంలో రోగికి 40 రోజుల పాటు వెంటిలేషన్, ఎక్మోపై ఉంచి విజయవంతంగా చికిత్స పూర్తి చేసి ప్రాణాలు కాపాడామన్నారు.

అన్ని పండగలకు ప్రాధాన్యం



ఇఫ్తార్‌లో పాల్గొన్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

రసూల్‌పురా: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని మతాల పండుగలను ప్రభుత్వమే నిర్వహిస్తోందని బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. న్యూ బోయిన్‌పల్లి, తాడ్‌బండ్‌లోని పలు మసీదుల వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. రంజాన్ సందర్భంగా ముస్లింలకు కానుకలతో పాటు ఇఫ్తార్ విందుకు లక్ష రూపాయలను అందజేస్తున్నారని చెప్పారు. రహమాన్, అతావుల్లా షరీఫ్, హసీన్ ఖాన్ పాల్గొన్నారు. అదే విధంగా తాడ్‌బండ్‌లోని మసీదు కమిటీ వద్ద జరిగిన ఇఫ్తార్ విందుకు బోర్డు మాజీ సభ్యులు కే. పాండుయాదవ్, రహమాన్ ఆబీద్‌పాషా, జకీర్, మసూద్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ఫీజుల పెంపుపై వినతి



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజు పెంపుపై విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డికి సోమవారం ఓయూ రీసెర్చ్ స్కాలర్స్ వినతి పత్రం అందజేశారు. త్వరలోనే వీసీ ప్రొ.రవీందర్‌తో మాట్లాడుతానని మంత్రి హామీ ఇచ్చినట్లు అజాద్, మహేష్, కిరణ్ పేర్కొన్నారు.

ఏబీవీపీ వినతి పత్రాలు..

పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజు తగ్గింపుతో పాటు ఓయూ విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్ ఆధ్వర్యంలో 12 మంది డీన్లు, ఇతర అధికారులకు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. సకాలంలో పీజీ అడ్మిషన్లు చేపట్టి ఫెలోషిప్‌లు అందచేయాలని, ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలని వినతి పత్రాలలో కోరారు.

అనాలోచిత నిర్ణయాలు.. ఇబ్బందుల్లో విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో లా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. కేవలం ఒక రోజు ముందు పరీక్ష కేంద్రాన్ని మార్చి హాల్ టిక్కెట్లు జారీ చేయడంతో బషీర్‌బాగ్ పీజీ న్యాయ కళాశాల విద్యార్థులు ఓయూ క్యాంపస్‌లోని పాలన భవనం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షలు నేటి (18న) నుంచి ప్రారంభం కానుండగా ఈ నెల 17న హాల్ టికెట్లను జారీ చేశారు. అయితే గతంలో ఉన్న అదే కాలేజీలో పరీక్ష సెంటర్ (సెల్ఫ్ సెంటర్) కు కాకుండా నారాయణగూడ కేశవ మెమోరియల్ కాలేజీ, బాగ్‌లింగంపల్లి అంబేద్కర్ కాలేజీల్లో సెంటర్లను ఏర్పాటు చేశారు. హఠాత్తుగా పరీక్ష కేంద్రాన్ని మార్చడంతో ఆగ్రహించిన లా విద్యార్థులు ఓయూ పాలన భవనం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పరీక్షలకు వారం రోజుల ముందు హాల్ టికెట్లు జారీ చేయాలనే నిబంధన ఉన్నా పట్టించుకోకుండా ఒక రోజు ముందు హాల్ టికెట్లు ఇచ్చి, పరీక్ష కేంద్రాన్ని మార్చడం ఓయూ పరీక్షల నిర్వహణ అధికారి పనితనానికి నిదర్శనమని మండిపడ్డారు.

ఈ-పెట్టీ కేసుల్లో ముగ్గురికి జైలు



రవి | రోహిత్ | ఖలీల్

అడ్డగుట్ట: ఈ-పెట్టీ కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష విధించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. ఆజాద్ చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన రవి(40) తన భార్యను చిత్రహింసలకు గురి చేస్తున్న నేపథ్యంలో ఈ-పెట్టీ కేసు నమోదైంది. అంబేడ్కర్ నగర్‌కు చెందిన రోహిత్(20) స్థానికంగా ఓ వ్యక్తితో గొడవపడి అతడిని గాయపరిచాడు. అదే విధంగా వెస్ట్ మారేడుపల్లికి చెందిన ఖలీల్(28) ఓ మహిళతో గొడవ పడడమే కాకుండా అసభ్యకరంగా ప్రవర్తించడంతో అతనిపై కూడా ఈ పెట్టీ కేసు నమోదైంది. ముగ్గురిని సోమవారం సికింద్రాబాద్‌లోని 15వ స్పెషల్ ఎంఎం మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టగా రవికి 7, రోహిత్‌కు 30, ఖలీల్‌కు 38 రోజుల జైలు శిక్ష విధించారు.

పూడిక తీస్తారు.. రోడ్డుపై వేస్తారు

లాలాపేట: ఓపెన్ నాలాలో నుంచి తీసిన వ్యర్థాలను ఇష్టానుసారంగా రోడ్లపై వేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం స్థానిక సామాజిక కార్యకర్త నేతికార్ మహేశ్ ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. లాలాపేట ప్రధాన రహదారి నుంచి సత్యానగర్, ఇందిరానగర్, శ్రీపురి కాలనీ, చంద్రబాబునగర్ తదితర ప్రాంతాలకు చెందిన వందల మంది నిత్యం ఇదే రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి నాలా లోంచి తీసిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని కోరుతున్నారు.



రోడ్డుపై వేసిన వ్యర్థాలను చూపిస్తున్న స్థానికుడు

దళితరత్న అవార్డుల ప్రదానం



మంత్రి తలసానితో గణేష్

రాంగోపాల్‌పేట్: నెక్లెస్‌రోడ్డులోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన గణేష్‌కు దళితరత్న అవార్డు వచ్చింది. అంబేడ్కర్‌నగర్ బస్తీ ప్రజల కోసం చేపట్టిన సామాజిక సేవలను గుర్తించి అంబేడ్కర్ జయంతి సందర్భంగా అవార్డును అందించారు. మంగళవారం ఆయన మంత్రి తలసానిని కలువగా మంత్రి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మహేష్‌ను అభినందిస్తున్న పద్మారావు గౌడ్

పద్మారావునగర్: బీఆర్‌ఎస్ నాయకులు బీ. మహేష్‌కు దళితరత్న అవార్డు లభించింది. సోమవారం ఆయన డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను కలువగా ఆయన మహేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. దళితరత్న అవార్డు సమాజం పట్ల తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. దళిత హక్కులతో పాటు అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

గ్యాస్ స్టవ్ నుంచి మంటలు

- సామగ్రి అంతా దగ్ధం
- ఆదుకోవాలని బాధితుల విజ్ఞప్తి





రోదిస్తున్న బాధితులు

బన్సీలాల్‌పేట్: గ్యాస్ స్టవ్ నుంచి మంటలు ఎగిసిపడి వస్తువులన్నీ కాలిపోయిన ఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. జయప్రకాష్‌నగర్‌లో నివసించే మహ్మద్ అన్వర్ కుటుంబీకులు రంజాన్ మాసం సందర్భంగా సోమవారం ఉదయం 4గంటల ప్రాంతంలో సహార్ కోసం సిద్ధం చేస్తున్న సమయంలో గ్యాస్‌స్టవ్ నుంచి మంటలు ఎగిసిపడ్డాయి. ఇంట్లో ఉన్న వాళ్లంతా ఒక్కసారిగా భయపడి అరుపులు, కేకలు వేయడంతో చుట్టూ పక్కల వాళ్లు వచ్చి ఇంటిపైకెక్కి రేకులు పగలగొట్టి చిన్న పిల్లలను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి అంతా దగ్ధమవడంతో నిరుపేద కుటుంబం రోడ్డున పడింది. విషయంలో తెలుసుకున్న స్థానిక నాయకులు ముక్కా శ్రీనివాస్, కార్పొరేటర్ కె. హేమలత, ఆర్‌ఐ శ్రీనివాస్ వేర్వేరుగా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అగ్నిప్రమాదం కారణంగా సామగ్రి అంతా కాలిపోయిందని ప్రభుత్వం తరపున ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

మహాదీక్షను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: నేడు (18న) ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన నిరుద్యోగ మహాదీక్షను జయప్రదం చేయాలని టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు కోరారు. యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట ఓయూ విద్యార్థులతో పేపర్ లీకేజీ వ్యవహారంపై సోమవారం 'మాట–ముచ్చట' కార్యక్రమం జరిగింది. అనంతరం మీడియా సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. ఘటనపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. టీజేఎస్ నేత ప్రొ.కోదండరామ్, కాంగ్రెస్ నేతలు మల్లు రవి, డాక్టర్ చెరుకు సుధాకర్, బీఎస్పీ రాష్ట్ర చీఫ్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎంఎల్ పార్టీ నేత గోవర్ధన్, తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ ఫ్రంట్ చైర్మన్ చనగాని దయాకర్‌గౌడ్ పాల్గొని ప్రసంగించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379